# పోలీసు పంచాయితీ

"ఓ అర్ధరూపాయికి బార్లీ గింజలియ్యయ్యా. పిల్ల ఒళ్ళు మసిలి పోతున్నది. బార్లీనీళ్ళిస్తే జరం తగ్గిపోతుందన్నది మా అక్క" అనడిగింది పార్వతి కోమటి ఆదినారాయణని.

అతనేం మాట్లాడలేదు. వచ్చిన గ్రాహకులకు సరుకులిచ్చి పంపేస్తున్నాడు కానీ, ఈమె సంగతి పట్టించుకోలేదు. సరుకులు కొనుక్కోటానికి దుకాణానికి వచ్చిన మనుషులు కూడా ఆమె వంక చూడటం లేదు. ఓ మనిషి అక్కడ నిలబడి ఉందన్న ధ్యాసే ఎవరికీ ఉన్నట్టు లేదు.

"ఏందీ మాట్లాడవు?" అని రెట్టించింది పార్వతి.

కొట్టు నుండి గ్రాహకులంతా వెళ్ళిపోయాక, "నన్ను బతకనీ, వెళ్ళు" అన్నాడు ఆది నారాయణ.

"అట్లంటే ఎట్లా? ఇప్పుడు మట్టువాడ పోవల్నంటే నాకోపికలేదు. మా ప్రసాదు పొలానికి పోయాడు తండ్రితో. నీక్కూడా మేమంత దుష్టులమయిపోయినామా?" అంది పార్వతి.

"ఆ న్యాయాన్యాయాల సంగతి నాకు తెలీదు. నన్ను అడక్కు. నీకు బార్లీగింజలు అమ్మిన సంగతి జనానికి తెలిస్తే నన్ను బతకనివ్వరు. నన్ను కూడా వెలేస్తారు. నా బతుకు నన్ను బతకనీ. నువెళ్ళు" అన్నాడతను.

కొట్టుకు వచ్చిన మనిషిని వట్టి చేతుల్తో పంపటం అతనికీ కష్టంగానే ఉంది. కానీ, అతని చేతుల్లో ఏంలేదు. పార్వతి కుటుంబాన్ని, ఆమె బావగారి కుటుంబాన్నీ గ్రామ పెద్ద వెలివేశాడు. 'వాళ్ళతో ఎవరూ మాట్లాడరాదు. మంచినీళ్ళు ఇవ్వరాదు. దుకాణాల్లో వస్తువులు విక్రయించరాదు. రైసుమిల్లుల్లో వాళ్ళ ధాన్యం ఆడించరాదు' అని గ్రామపెద్ద ఆదేశించాడు. ఈ సాంఘిక బహిష్కరణ రెండేళ్ళుగా కొనసాగుతోంది.

"పిల్ల జరంతో ఛస్తే, దాని ఉసురు నీకు తగుల్తుంది" అంది కోపంగా పార్వతి.

"ఏంది, నాక్కూడా చేతబడి చేస్తవా?" అన్నాడు ఆదినారాయణ భయపడిపోతూ

"చేతబడి చేసే శక్తే నాకుంటే నువ్విట్టా మాట్టాడవు"

"చెప్పకు. అందుకేగా మిమ్మల్ని వెలివేసింది"

"ఎందుకు వెలేశారో ఆ దేవుడికే తెలియాలి. ఇంతకీ బార్లీగింజలిస్తావా, లేదా?"

ఆదినారాయణ కొట్టు బయటకు అటూ ఇటూ చూసి, కొట్టువేపు ఎవరూ రావటం లేదని నిర్ధారించుకుని, హడావుడిగా బార్లీగింజలు ఓ పొట్లంలో కట్టి ఇచ్చి, "వెళ్ళు, తొందరగా వెళ్ళిపో. నేనాగింజలు ఇచ్చానని ఎవరికీ చెప్పకు. ఎవరైనా కొట్టు కొస్తారు. బేగెళ్ళు. నీపైసలు కూడా నాకొద్దు" అన్నాడు.

"నేనేం బిచ్చపు దాన్ని కాదు" అంటూ అర్ధరూపాయి బిళ్ళ అతని గల్లాపెట్టెవైపు విసిరి వెళ్ళిపోయింది పార్వతి, కొంగుచాటున బార్లీగింజల పొట్లాన్ని దాచుకుంటూ.

సంఘ బహిష్కరణ కారణంగా ఆ రెండు కుటుంబాలూ ఎంతో ఇబ్బంది పడుతున్నాయి. ఇంట్లోకి ఏ సరుకు కావల్సి వచ్చినా అనంతారం నుండి మట్టువాడ వెళ్ళాల్సిందే. మట్టువాడ ఓ మాదిరి పెద్దఊరు. అనంతారం నుండి నాలుగు కిలోమీటర్ల దూరం. ఉప్పు కావల్సినా, పప్పు కావల్సినా అంత దూరం వెళ్ళాల్సిందే. ధాన్యాన్ని రైసుమిల్లులో ఆడించరు. బండిలో వేసుకుని మట్టువాడ వెళ్ళాల్సిందే.

వెంకటేశ్వర్లు, బాలచంద్ర అన్నతమ్ములు. వెంకటేశ్వర్లు భార్య లక్ష్మమ్మ. బాలచంద్ర భార్య పార్వతి. వెంకటేశ్వర్లకి ఒక్కతే కూతురు కృష్ణవేణి. బాలచంద్రకు ఒక కొడుకు, ఒక కూతురు. కొడుకు పేరు ప్రసాదు, కూతురి పేరు భాగ్యలక్ష్మి పదేళ్ళ ఆ పిల్ల జ్వరంతో తీసుకుంటుందనే బార్లీగింజలకోసం పార్వతి ఆదినారాయణ కొట్టుకు వచ్చింది. అన్నదమ్ములకు అరెకరాల పొలం ఉంది. వెంకటేశ్వర్లు మేథకుడు. ఏదీ పట్టించుకోడు. వాళ్ళదింకా అవిభక్త కుటుంబమే. పేరుకు ఇంటి యజమాని వెంకటేశ్వర్లయినా, నిర్వహణ అంతా బాలచంద్రదే. వెంకటేశ్వర్లకు లేక లేక ఒక్క కూతురు కలిగింది. ఆమెకు పదహారేళ్ళొచ్చాయి. పిల్లకు పెళ్ళి చేయాలని బాలచంద్ర చూస్తున్న తరుణంలో ఈ సంఘ బహిష్కారం వచ్చి పడింది. ఊళ్ళో వాళ్ళెవరూ తమ పిల్లను చేసుకోరు. ఊరి బయటి సంబంధాలు చూశాడు బాలచంద్ర. కాని చేతబడులు చేస్తారని పేరు పడగానే ఎవరూ వచ్చి ఆ పిల్లను పెళ్ళి చేసుకోటానికి సాహసించటం లేదు. ఆడపిల్లలకు చదువు చెప్పించటం ఆ కుటుంబంలో లేదు. ఒక్క ప్రసాదుకు మాత్రం ఇంటర్మీడియట్ దాకా చదువు చెప్పించారు మట్టువాడ పంపి.

ఈ ప్రపంచంలో ఏదీ కారణం లేకుండా జరుగదు. అన్నింట్లో వ్యక్తంగా కారణం కన్పించకపోవచ్చు. ఈ సాంఘిక బహిష్కరణకూ కారణముంది. ఊరి పెత్తందారు వెంకట్రాయుడు చెప్పే కారణాలు వేరు. వెంకటేశ్వర్లు పినతండ్రి సూరయ్య మనవడు జ్వరం వచ్చి మూసినకన్ను తెరవక పడున్నాడు. పిల్లవాడికి ఎనిమిదేళ్ళుంటాయి. ఊళ్ళో ఆచార్లుగారు ఇచ్చిన మందు పనిచెయ్యలేదు. దిష్టి తగిలిందన్నారు. లక్ష్మమ్మకు పాము మంత్రం, తేలు మంత్రం, దిష్టిమంత్రం లాంటివి వచ్చు. ఆమె దిష్టితీస్తే ఏ అరిష్టమున్నా తొలగిపోతుందని ఆ కుటుంబంలో నమ్మకం. అందుకే, ఆమెను వచ్చి పిల్లవాడికి దిష్టి తియ్యమని కోరాడు పినమామ. లక్ష్మమ్మ వచ్చి దిష్టి తీసింది. పిల్లవాడి కళ్ళుచూస్తే పచ్చగా ఉన్నాయి. "పచ్చకామెర్లు" అంది ఆమె. పచ్చకామెర్లకు సూది మంత్రం పెడ్తుందామె. రోగి మూసిన కళ్ళమీద సూదులు ఆడిస్తూ ఏదోమంత్రం జపిస్తుంది. ఓ చిన్నగిన్నెలో నీళ్ళు పోసి ఆ సూదుల్ని ఉంచుతుంది. సాయంత్రానికి నీళ్ళరంగు పచ్చగా మారితే పచ్చకామెర్లు తగ్గుతుందని అర్థం. మంత్రమే కాక పేడలో పెరుగేసి, రోగికి తినిపించి, వైద్యం చేసేది. అలాంటి వైద్యం, మంత్రం పెట్టటం ఎప్పటినుంచో చేస్తున్నది ఆమె. అలాగే సూరయ్య

మనవడికీ చేసింది. కానీ, పిల్లవాడి రుగ్మత ఆ మంత్రానికీ, వైద్యానికీ లొంగక పిల్లవాడిని ఎత్తుకుపోయాకనే వివాదం మొదలైంది.

"నీ మనమడు పోయాడంటగా?" అని పరామర్శించాడు వెంకట్రాయుడు సూరయ్యని.

"అవునయ్యా. వైద్యం చేయించినాం, మంత్రం వేయించినాం. కామెర్లంట. పిల్లగాడు మాకు దక్కలేదు" అన్నాడు సూరయ్య.

"లక్ష్మమ్మేగా మీ పిల్లగాడికి మంత్రంవేసింది? ఏం మంత్రం వేసిందో ఏమో, చేతబడులు కూడా చెయ్యగలిగిన మనుషులు వాళ్ళు!" అన్నాడు వెంకట్రాయుడు.

"అట్లెందుకంటారు లెండి. మనకు ప్రాప్తం లేదు. పిల్లగాడు పోయ్యాడు".

"మీ తల్లి పొలం నువ్వే కాజేస్తివి. వాళ్ళూరుకుంటారటయ్యా?"

"ఏమో, ఎవరి పాపాన వాళ్ళుపోతారు."

అలా వెంకట్రాయుడితో చెప్పివచ్చాడు కానీ వెంకట్రాయుడు ఆయన బుర్రలో ప్రవేశ పెట్టిన పురుగు తొలుస్తూనే ఉంది. ఇంటికొచ్చి కొడుకు గోపాలానికి చెప్పినదాకా ఆయన మనసుండబట్టలేదు. గోపాలానికి వార్త చేరగానే అనుమానం నిజమైపోయింది. అతను అగ్గిలో పెట్టిన గుగ్గిలమే అయాడు.

"వెధవ పొలం కోసం ఇంతచేస్తారా! పసికందుకు చేతబడి చేసి చంపుతారా? నీ అన్న కొడుకుల్ని ఇద్దర్నీ చంపితేగానీ నా గుండె మంట చల్లారదు" అంటూ చేతికర్ర తీసుకుని బయలుదేరాడు.

కొడుకు ఆగ్రహాన్ని శాంతపరిచేటప్పటికి సూరయ్య పుతమారింది.

"వాళ్ళు చేశారోలేదో, ఉత్త అనుమానంతో వాళ్ళను నిందించి ప్రయోజనం లేదు" అన్నాడు సూరయ్య.

"చెయ్యకేం చేసే ఉంటారు, వెధవలు! తప్పుడు నా కొడుకులు! అన్న కొడుకులని దగ్గరికి తీస్తావు కానీ వాళ్ళెంతకైనా తగినవాళ్ళే" అన్నాడు గోపాలం.

గోపాలం అన్న 'వెధవ పొలం' సంగతి కూడా మీకు చెప్పాలి. సూరయ్య అన్న పేరు కాంతయ్య. అన్నతమ్ములు వాటాలు పంచుకునేటప్పుడు తల్లికి ఓ రెండెకరాలను కున్నారు. తమ వాటాల గురించి పత్రాలు రాసుకున్నారు కానీ తల్లికిచ్చిన రెండెకరాలకూ ఏ పత్రాలు లేవు. పొలం సూరయ్య అధీనంలో ఉండేది. తనే పండించి అన్న దగ్గరున్న తల్లికి పంట ఇచ్చేవాడు. అలా తల్లి బతికినంతకాలం కొనసాగింది. తల్లి పోయాక అన్న వాటా కూడా ఇవ్వటం మానేశాడు సూరయ్య. "పోనీ వెధవ గడ్డి కరుస్తున్నాడు" అని కాంతయ్య ఎప్పుడూ తమ్ముడిని నిలదీసి అడగలేదు. తండ్రిపోయాక బాలచంద్ర "నాయ నమ్మ పొలం మనకు ఎకరం రావాలి. వెళ్ళి అడుగుదాం పద" అని అన్నను తీసుకువెళ్ళి పినతండ్రిని అడిగాడు.

"ఏం పొలంరా, మా అమ్మకు వేరే పొలమేం లేదు. అమ్మ అన్న దగ్గరుంటున్నది కదా అని నేనే నా రెండెకరాల్లో పండిన పంటను అన్నకిచ్చేవాడిని. మీరిప్పుడు అందులో

భాగం కావాలనటం న్యాయంగా లేదు" అన్నాడు సూరయ్య. నిజానికి ఆయన మాటలు కావు అవి. కొడుకు గోపాలం ఆయన చేత అన్పించిన మాటలు అవి.

"చిన్నాయనా, నీకు తెలిసే అబద్ధం ఆడుతున్నావు. అన్న కొడుకులకు అన్యాయం చేస్తే నువ్వు బాగుపడవు" అన్నాడు కోపంగా బాలచంద్ర అన్నను తీసుకువెళ్ళిపోతూ.

సాయంత్రం కొడుకు పొలం నుండి వచ్చాక. కొడుక్కు నచ్చజెప్ప ప్రయత్నించాడు సూరయ్య.

"వాళ్ళ పొలం ఎకరం వాళ్ళకిచ్చేద్దాముర్రా. మనకి న్యాయం కాదు" అని

"పొలం నువ్వే సాగుచేశావు. కష్టనష్టాలు నువ్వే భరించావు. రెండెకరాల పంటంతా అమ్మా, అన్నా అని వాళ్ళకు దొబ్బ పెట్టావు ఇన్నాళ్ళూ. కనీసం కష్టానికి కూలయినా గిట్టుబాటు కాలేదు నీకు. చెల్లుకు చెల్లు. పెదనాయన కొడుకులకు నువ్వు ఇవ్వాల్సిందేం లేదు. మాట్లాడకు" అన్నాడు గోపాలం దురుసుగా.

"అదేందిరా మా అమ్మ మా అన్న దగ్గరేవుంది. రోగమొచ్చినా రొష్టొచ్చినా వాళ్ళే చేశారు. మా వదినమ్మ పోయినా అన్న అమ్మను నా ఇంటికి పంపలేదు. ఉమ్మడి పెట్టుబడు లేమున్నా అన్నే పెట్టాడు. నన్నేరోజు పైస అడగలేదు. వాళ్ళ ఎకరం పొలం వాళ్ళకివ్వక పోవటం ధర్మం కాదు" అన్నాడు సూరయ్య.

"ఏం ధర్మం! ఆయన తల్లిని ఆయన దగ్గరుంచుకున్నాడు. అమ్మకు అన్న పెట్టటం ఊరికి ఉపకారం కాదు. పెద్దవాడన్నాక ఉమ్మడి ఖర్చులు పెట్టుకోవాల్సిన బాధ్యత ఆయనదే. మీ అన్నేదో ఘనకార్యం చేసినట్టు మాట్లాడక" అని గోపాలం అన్నాక సూరయ్య నోరుపడిపోయింది.

అయితే బాలచంద్ర ఊరుకోలేదు. ఊరు పెత్తందారు వెంకట్రాయుడి దగ్గర తన పినతండ్రి చేసిన దురన్యాయం సంగతి ఫిర్యాదు చేశాడు. వెంకట్రాయుడు సూరయ్యను, గోపాలాన్ని పిలవనంపాడు. వెంకట్రాయుడు అడిగిన మాటకు సూరయ్య జవాబివ్వలేదు కానీ గోపాలం సమాధానం చెప్పాడు.

"మా నాయనమ్మకేం పొలం లేదండీ. మా నాయనే తల్లి అన్నగారి దగ్గరుంది కదా అని ప్రతియేట రెండెకరాల పంట ఇచ్చాడు. ఇప్పుడు వాళ్ళు ఎదురు రంకు కడ్తున్నారు. అప్పనంగా యేళ్ళతరబడి రెండెకరాల పంట తిన్నదికాక, మా వాటా ఎకరం అంటూ వచ్చారు. వాళ్ళకు సిగ్గులేదు అలా అడగటానికి. నాయనమ్మ పేరున పొలమున్నట్లు అలాంటి పత్రమేమన్నా ఉంటే చూపెట్టమనండి. అప్పుడు వాళ్ళకివ్వాల్సింది ఇస్తాం. అంతేగానీ, ఏదో ఊహించుకుని మాకు ఎకరం వాటా రావాలంటే కుదరదు".

అయితే, ఊళ్ళో వాళ్ళందరికీ తెల్సు ముసలమ్మకి రెండెకరాల పొలం కొడుకు లిచ్చారని. "మీకున్న ఆరెకరాలు కాక, అదనంగా రెండెకరాల పొలం సేద్యం చేసుకుంటు న్నారే, వాటికేమన్నా పత్రాలుంటే పట్టుకురండి" అని వెంకట్రాయుడు అడగలేదు. అతనికి వెంకటేశ్వర్లు, బాలచంద్రల కుటుంబమంటే మంటగా ఉంది. అందుకే అతను గోపాలాన్ని

నిగ్గదీసి అడగలేదు. చేసేది లేక వెంకటేశ్వర్లు, బాలచంద్ర ఉత్తచేతుల్తో వెళ్ళిపోయారు. కానీ బాలచంద్ర, గోపాలాల మధ్య గడ్డి వేస్తే బుగ్గయేటట్లుంది పరిస్థితి. నిజానికి లక్ష్మమ్మను కొడుక్కి మంత్రం వేయటానికి పిలవటం గోపాలానికిష్టం లేదు. ఆపద సమయం కనుక తండ్రి పిలుస్తానంటే కాదనలేదు. కొడుకు పోయాక, అందుకు కారణం లక్ష్మమ్మ చేసిన చేతబడే అని నిర్ధారించుకున్న గోపాలం, ఆ కుటుంబంపై ఎలా కసి తీర్చుకోవాలా అని ఆలోచించసాగాడు.

వెంకట్రాయుడికి వెంకటేశ్వర్లు కుటుంబమంటే మంట ఉండటానికి కారణముంది. వెంకటేశ్వర్లు కూతురు కృష్ణవేణి పదహారేళ్ళ వయసులో ఓమోస్తరు అందంగానే ఉంటుంది. అందం కంటే ఆకర్షణ ఆమెలో అపరిమితం. ఆమెను చూసిన రెండునెల్లుగా ఆమె పట్ల తమకం పెంచుకున్నాడు వెంకట్రాయుడు. ఏ పిల్లయినా అతని దృష్టిలో పడితే, ఏదో విధంగా ఆమెను పక్కలోకి తెచ్చుకోకపోతే నిద్రపట్టేది కాదు వెంకట్రాయుడికి. అయితే, ఊరిపెద్దగా తనే వ్యవహారమూ బహిరంగంగా అందరికీ తెలిసేట్టుగా చేయటానికి వీల్లేదు. బయటికి పొక్కినా, అతన్ని ఎదిరించే ధైర్యం లేక, ఏం జరగనట్టు ప్రవర్తించేవాళ్ళు ఊరి వాళ్ళు. అలా అతను తన ఉబలాటం తీర్చుకుని, పైకి పెద్దమనిషిగా వ్యవహరించేవాడు. ఓరోజు సాయంత్రం అతను పొలానికి వెళ్ళి తిరిగి వస్తుంటే, గరువు నుండి గడ్డిమోపు ఎత్తుకొస్తున్న కృష్ణవేణి అతనికి కన్పించింది.

"ఏందే పిల్లా, ఏడనుంచేసుకొస్తున్నావు గడ్డిమోపు?" అని సరసంగా అడిగాడు వెంకట్రాయుడు.

"ఏడనుంచేసుకొస్తాను. మీ పొలంలో నుంచే" అంది కృష్ణవేణి.

ఆమె వయసులో చిన్నదేకానీ ఊర్లోని యువకులు తనవంక తమకంగా చూడటం ఎరుగును. పల్లెటూరు యువతి కనుక తనెంత జాగ్రత్తలో ఉండాలో ఆమెకు తెలుసు. అందుకు ఆమెకు తల్లిదండ్రుల సాయం అవసరం లేదు.

"మా పొలమయితే, నీకు పంటే ఇస్తాను, గడ్డేంటే?"

"ఎందుకిస్తావు, మీ అబ్బంక చుట్టమనా, అమ్మంక చుట్టమనా?"

"చుట్టరికం దేవుందే? నువ్వు నేనూ సంబంధం కలుపుకుంటేపోలా?"

"ఏందయ్యోయ్, ఆ సంబంధం?"

"నీకు తెలీకనా, నన్నడుగుతావు! నువ్వంటే నాకు మనసైందే."

"ఓరి సచ్చినోడా, మా అయ్య వయసుంది నీకు. బుద్ధి లేదు?"

"వయసేందే, జబ్బ సత్తువుండాలి గాని. నిన్ను చూసినంక ఆరేత్రి నాకు నిద్రపట్టదు" అంటూ చెయ్యి పట్టుకున్నాడతను.

ఆమె అతనిచెయ్యి విదించికొడ్తూ. గడ్డిమోపులో జూనిపిన కొడవలి తీసి, "నా జోలి కొస్తివా, నీకు పరువుదక్కదు. నీకు లొంగే ఆడదాన్ని కాదు" అంది అతన్ని బెదిరిస్తూ.

"పొయ్యే, నీలాంటోళ్ళని చాలమందిని చూసాను. నువ్వేదారికి వస్తావు" అని తన దారి పట్టాడు.

అలా మొదటి ప్రయత్నం విఫలమైనా అతను మళ్ళీ మళ్ళీ ఆమె కోసం ప్రయత్నించటం మానుకోలేదు. మరోరోజు మునిమాపువేళ ఆమెక్కడినుండో ఇంటికి తిరిగి వస్తూంటే వెంకట్రాయుడి జీతగాడు, "అమ్మ నిన్నోసారి లోపలికి వచ్చి వెళ్ళమన్నది" అని చెప్పాడు.

వెంకట్రాయుడి భార్యతో కృష్ణవేణికి పరిచయమే. ఆమె తను పుట్టింటికి వెళ్ళి తెచ్చుకున్న చీరెలు, నగలు కృష్ణవేణికి చూపెడుతూ ఉంటుంది. అదో సరదా ఆమెకి. కృష్ణవేణి మెచ్చుకుంటే ఆమె పొంగి పోయేది. ఇంట్లో వెంకట్రాయుడి భార్య కనిపించలేదు, కానీ వెంకట్రాయుడు కన్పించాడు.

"అరుంధతమ్మ ఏడకెళ్ళింది?" అని అడిగింది అతన్ని ఆమె.

"ఎదురునుండే నన్నడగవు. అదెందుకు?" అన్నాడు వెంకట్రాయుడు.

"అమ్మ నన్ను రమ్మంది"

"అది కన్నారింటి కెళ్ళింది. నిన్ను పిలిచింది నేనేలే"

"ఎందుకూ?"

"ఎందుకేందే. మగాడు అడదాన్ని ఎందుకు రమ్మంటాడు! పొందుకోసం"

"నీకోసారి చెప్పాను. బుద్ధి లేదు నీకు" అంటూ ఆమె గిరుక్కున వెనక్కి తిరిగింది.

అయితే, అతను ఆమె కంటే ముందుగానే వచ్చి తలుపు బోల్టు వేశాడు. ఆమె తలుపు తీయాలని ప్రయత్నించింది. అతను ఆమెను విడవలేదు. చేతుల్లాగి ఆమెను కౌగలించుకోబోయాడు. పొలంలో కష్టించి పని చేసిన దృఢమైన శరీరం ఆమెది, కాలుతో గజ్జల్లో ఈడ్చి పెట్టి తన్నింది. అతను "అబ్బా" అంటూ నేల కూలిపోయాడు.

ఆమె అతనివంక తిరిగి, "ఇంక నావంకకు రాకు. బుద్ధి తెచ్చుకో. నేనసుంటి ఇసుంటి ఆడదాన్ని కాదు."

అతనామె వంక కోపంగా చూశాడు. "నీ ఆడతనమేందో చూస్తానే. నీ బతుకు నాశనం చేయకపోతే నా పేరు వెంకట్రాయుడే కాదు" అన్నాడతను, గజ్జల్లో చేయి పట్టుకుని బాధనోర్చుకుంటూ.

కృష్ణవేణి తన్ను తిరస్కరించటమొక్కటే కారణం కాదు వెంకటేశ్వర్లు కుటుంబం మీద అతనికి వైరం పుట్టటానికి. బాలచంద్ర కొడుకు, ఇరవయ్యేళ్ళవాడు, ఊళ్ళో కూలినాలికి వెళ్ళే జనాన్నంతా కూడగట్టుకుని, కూలిరేటు పెంచాడు. ఇదివరకులా లేరు జనం. తను ఎంత ఇస్తే అంతకు పనిచేయటం మానేశారు. ఓసారి వెంకట్రాయుడు ప్రసాదును నిల దీశాడు కూడా.

"ఏందిరా, ఊళ్ళో ఉండాలని లేదా? కూలిజనాన్ని ఎగేస్తున్నావు, కూలి రేటు పెంచమని" అని

"ఎన్నాళ్ళుండి మరి మీదొరతనం? మీరేమో మేడలు మిద్దెలు కట్టుకోవాలి. ఎకరాల మీద ఎకరాలు జమ చేసుకోవాలి. కూలిజనం అంతరించిపోవాలి. మీ జులుం ఇంక చెల్లదు" అన్నాడు దురుసుగా ప్రసాదు.

"కమ్యూనిస్టుల్లో చేరిపోయావ్రా?"

"కమ్యూనిస్టు లేంది! అన్నల్లో కూడా చేరిపోతాను, మీ బుద్ధి మార్చుకోకుంటే"

అన్నల మాట విన్నాక వెంకట్రాయుడికి భయం పట్టుకుంది. ఇంక ప్రసాదు జోలి కెళ్ళలేదు కానీ, ఆ కుటుంబంపై కత్తిగట్టాడు. అందుకే అతని దర్బారులో వెంకటేశ్వర్లకు, బాలచంద్రకు ఏం న్యాయం జరగలేదు. తన పథకంలో భాగంగా ఆ కుటుంబం వాళ్ళు చేతబడి చేస్తారని ప్రచారం చెయ్యసాగాడు. అతను యథాలాపంగా అన్నట్టు అన్న మాటలే గోపాలానికి తన పెదనాయన కుటుంబం చేతబడులు ప్రయోగించే కుటుంబమని నిర్ధారణ చేసుకోవటానికి కారణమయ్యాయి. వెంకట్రాయుడు వేసిన పథకానికి మరో అవకాశం కూడా కలసివచ్చింది.

వానలు కురవటంతో పొలం పదును చేసుకోటానికి అదే అదననుకుని వచ్చిన బాలచంద్ర, పార్వతులకు పక్క పొలం గనిమె తమవైపు జరిగి ఉండటం కనిపించింది. పక్క పొలం శీతారామయ్య చేసిన పనివాళ్ళ కర్థమైంది. శీతారామయ్య భార్య ఆదెమ్మ పొలంలో కన్పించింది.

"ఇదేం పనే మీరు చేసింది? గనిమెను మా పొలంలోకి గదిమారెందుకు?" అనడిగింది పార్వతి.

"మేమేం గదమలేదు. ఎప్పట్లానే ఉంది" అని సమాధానమిచ్చింది ఆదెమ్మ.

"తవ్వి పోసినట్టు కొత్త మట్టి కన్పట్టల్లా? ఏం జన్మలు మీవి? ఇంత అన్యాయానికి ఒడిగడ్తారుగనకే నీ కొడుకు అన్ని రోజులబట్టీ రోగంతో తీసుకుంటున్నాడు."

దాంతో ఇద్దరికీ మాటామాట పెరిగింది. జుట్లు పట్టుకుని కలియబడ్డారు. బాలచంద్ర వచ్చి విడదీసినా వాళ్ళు కొట్లాడుతూనే ఉన్నారు.

"దీన్తో ఏంది? పొలం కొలిపిస్తే తెలిసిపోతుంది. మాటలనవరరం" అన్నాడు బాల చంద్ర భార్యతో.

"ఏందిరోయ్, ఒళ్ళు కొవ్వెక్కిందా? అదీ ఇదీ అంటున్నావు!" అంది ఆదెమ్మ.

మొగుణ్ణి తిట్టినందుకు పార్వతి కోపానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

"ఇంత అన్యాయం చేసే మీరు దుంపనాశనమవుతారు. నీ కొడుకును బొందలోబెట్ట! నీ పాడెగట్ట! నువ్వు ముండమొయ్య!" అని తిట్లకు లంకించుకుంది పార్వతి.

ఆ రోజలా కొట్లాటయి ఇంటికి వచ్చిన ఆదెమ్మ ఇంట్లో కొడుకు శవమై కనిపించ టంతో పిచ్చిదైపోయింది. అంతకుముందే వెంకటేశ్వర్లు కుటుంబంవాళ్ళు చేతబడులు చేస్తారన్న పుకారు విని ఉన్నది ఆమె. తన కొడుకు చావటానికి కారణం తాము గనిమె

జరిపినందుకు కోపంతో వాళ్ళు కొడుకుపై ప్రయోగించిన చేతబడే అన్న నిర్ధారణకు వచ్చారు శీతారామయ్య దంపతులు. ఊళ్ళో అతిసార వ్యాధితో మరో ఇద్దరు చనిపోయారు. అంతకు ముందు గుసగుసలుగా చెప్పుకునే జనం ఇప్పుడు బాహాటంగానే చెప్పుకోసాగారు. వెంకటేశ్వర్లు కుటుంబంవాళ్ళు ఎవరు కన్పించినా తప్పుకుపోసాగారు. శీతారామయ్య వచ్చి వెంకట్రాయుడి దగ్గర తన గోడు వెళ్ళబోసుకున్నాడు. పార్వతి తన కొడుక్కు చేతబడి చేసిందన్నాడు.

"నా కొడుకును బొందలో పెట్టాలని శపించింది ఆ ముం... అట్టాగే అయింది" అన్నాడు శీతారామయ్య.

"అంతే అయి ఉంటుంది. లేకపోతే మన ఊళ్ళో ఇన్ని చావులెప్పుడైనా చూశామా?" అన్నాడు వెంకట్రాయుడు సంతోషిస్తూ, తాపీగా చుట్ట ముట్టించి.

"మరేందండీ మీరు కూడా చూస్తూ ఊరుకుండారు?"

వీధి అరుగు మీద ఈ సంభాషణ జరుగుతోంది. అటుగా పోతున్న గోపాలాన్ని చూసి పిల్చాడు వెంకట్రాయుడు.

"విన్నావా మీ వాళ్ళు చేసిన పని! మీవాళ్ళ చేతబడి ప్రయోగానికి ఇప్పటికి నాలుగు శవాలు లేచాయి ఊళ్ళో" అన్నాడు.

"నా వాళ్ళెవరండీ! నా కొడుకును వాళ్ళే చంపారు. అప్పటి నుండి మాకు వాళ్ళతో మాటల్లేవు. మీరిట్టా చోద్యం చూస్తుంటే లాభం లేదు. పంచాయితీ పెట్టి తీర్మానించాల్సిందే" అన్నాడు గోపాలం.

వెంకట్రాయుడనుకున్నట్టుగానే పావులన్నీ కదిలాయి. పంచాయితీ జరిగింది. వెంకట్రాయుడు రచ్చబండ మీద ఆశీనుడయాడు. వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పిలిపించారు, అభియోగాలు మొదలయ్యాయి. ముందుగా నేరం మోపింది గోపాలమే.

"వాళ్ళు నా బంధువులని చెప్పుకోటానికే నాకు సిగ్గేస్తున్నది. లక్ష్మమ్మ మంత్రాల మహామారి. నా కొడుకుని చేతబడి చేసి చంపింది. మా నాయనమ్మకు రెండెకరాల పొలముందట. అందులో సగభాగం రావాలని పట్టుబట్టారు. నేనివ్వనన్నాను. అందుకే చేతబడి చేసి నా కొడుకును చంపారు" అన్నాడు గోపాలం ఆవేశంగా.

"నా కొడుకునూ ఆళ్ళే చంపారు. దాన్నోరుపడిపోను. పార్వతి నా కొడుకు చావాలని తిట్టింది. ఏం మంత్రం వేసిందో సందాళకల్లా నా కొడుకు రక్తం కక్కుకు చచ్చాడు" అని చెప్పింది ఆదెమ్మ.

బాలచంద్ర వాదించాడు, తమకేం తెలియదని; వెంకటేశ్వర్లు ప్రార్థించాడు, తమపై అలాంటి నీలాపనింద మోపవద్దని; ప్రసాదు కోపంతో ఊగిపోయాడు, కూలిజనాన్ని కూడగట్టినందుకు వెంకట్రాయుడు తమపై అలా కక్ష సాధిస్తున్నాడని, కృష్ణవేణి నిప్పులు కురిపిస్తూ రాయుడి వంక చూసింది కానీ ఏం మాట్లాడలేదు. లక్ష్మమ్మ తమ చేసిన పొరపాటేమిటో తెలియక నివ్వెరపోయి చూస్తున్నది. పార్వతి ఇంత ఘాతుకమైన ఆరోపణా

అని అవాక్కయి నిలబడింది. ఎనిమిదేళ్ళ భాగ్యలక్ష్మి ఏం జరుగుతుందో అర్థం కాక, సూరయ్యను చూసి, "తాతా!" అని ఆయన దగ్గరికి రాబోయింది. ఆయన ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

వెంకటేశ్వర్లు కుటుంబంవాళ్ళు చేతబళ్ళు చేస్తారన్న నిర్ధారణ చేసింది పంచాయితీ. వెంకట్రాయుడి తొత్తులు 'వీళ్ళను బతకనివ్వటానికి వీల్లేదు, సజీవ దహనం చెయ్యాల'న్నారు. కొంతమంది 'చెట్టుకు కట్టి కొట్టాల'న్నారు, 'గుండు గొరిగించి నగ్నంగా వీధుల్లో తిప్పాల'న్నారు, కొంతమంది అహింసావాదులు.

చివరకు వెంకట్రాయుడు మాట్లాడాడు: "మీ ఆగ్రహం నాకర్థమైంది. వాళ్ళు దుష్టులు. మన ఊళ్ళో ఉండాల్సిన వాళ్ళు కాదు. అయితే, నేను గాంధేయవాదిని. మీరన్నవేవీ చేయటం నాకిష్టంలేదు. వాళ్ళ చేసిన తప్పుకు ఇవాల్టి నుండి వాళ్ళను వెలివేస్తున్నాను. ఇవాల్టి నుండీ వాళ్ళతో ఎవరూ మాట్లాడకూడదు, ఎవరూ ఏ సాయమూ చెయ్యకూడదు, మంచినీళ్ళు కూడా ఇవ్వకూడదు, దుకాణంలో సరుకులు అమ్మకూడదు, రైసుమిల్లులో వాళ్ళ ధాన్యం ఆడించకూడదు. వాళ్ళ పొడే మనకొద్దు. వాళ్ళ పాపాన వాళ్ళే పోతారు. పంచాయితీలో ఉన్నవాళ్ళంతా ఒక్కొక్కళ్ళే వచ్చి వాళ్ళ ముఖాన ఊసివెళ్ళండి. అది చాలు శిక్ష. ముందు వాళ్ళందర్నీ చెట్టుకు కట్టేయండి."

వెంకట్రాయుడి ఆదేశంపై వాళ్ళను చెట్టుకు కట్టేశారు. ముందుగా ఊయటానికి ముందుకు వచ్చింది గోపాలం. బాలచంద్ర ముఖం మీద ఊస్తూ, "థూ" అని వెళ్ళి పోయాడు. శీతారామయ్య వెంకటేశ్వర్లు ముఖం మీద ఊశాడు. ఆదెమ్మ పార్వతి ముఖం మీద ఊసింది. ఊళ్ళో జనం వాళ్ళలో ఎవరి మీద కోపం ఉంటే వాళ్ళమీద ఊశారు. చివరగా వచ్చిన వెంకట్రాయుడు కృష్ణవేణి, ప్రసాదుల వంక చూసి వంకర నవ్వు నవ్వుతూ, "నాతో పెట్టుకుంటే ఏమవుతుందో తెలిసిందా? రంకు ముం...! నిన్నింతటితో వదుల్తా ననుకోకు. ... ఏరా నాయాలా, కమ్యూనిస్టోడివా నువ్వు, అన్నల్తో జేరతావా? వెళ్ళు... ఇప్పుడు చేరు. మీ బతుకుల్చెడా! థూ, థూ" అని వాళ్ళిద్దరి మీదా ఊసివెళ్ళాడు.

ఈ కార్యక్రమమంతా జరుగుతూ ఉంటే సూరయ్య ముఖం మీద చేతులుంచుకుని ఏడుస్తూ నేలకూలబడిపోయాడు. వాళ్ళనలా చెట్టుకు బంధించి ఊరిజనమంతా వెళ్ళి పోయారు. ఇంకా అలాగే నేలబడి పొర్లి ఏడుస్తున్న సూరయ్యను చూసి, "రా, చిన్నాయనా! నీ పని కూడా కానీ" అని పిల్చాడు వెంకటేశ్వర్లు.

సూరయ్య ఏం మాట్లాడకుండా లేచాడు. తొట్రు పడేనడకతో కాళ్ళీడిస్తూ వచ్చాడు. కట్లు విప్పి చెట్లకు కట్టేసినవాళ్ళని విడిపించాడు. "వెళ్ళండి నాయనా, వెళ్ళండి. నేను ధృతరాష్ట్రుణ్ణి. మీరంతా ఉమ్మేసినా నా పాపం ప్రక్షాళన కాదు" అని చెప్పి మెల్లగా నడుచు కుంటూ వెళ్ళిపోయాడు. ఆ తరవాత ఆయన రెండు నెలలకంటే బతకలేదు.

సంఘ బహిష్కరణతో వెంకటేశ్వర్ల కుటుంబపు బతుకు దుర్భరమైంది. వెలికి గురయిన మొదటి నెలరోజుల్లో దిగ్భ్రాంతులయిన వాళ్ళకు ఏం చేయాలో తోచలేదు.

వెలికంటే అధికంగా పంచాయితీలో జరిగిన అవమానం ప్రసాదును ఎక్కువగా బాధించ సాగింది.

ఓసారి మట్టువాడ వెళ్ళొచ్చిన ప్రసాదు తండ్రితో అన్నాడు: "నిన్న మట్టువాడ వెళ్ళినప్పుడు నా స్నేహితుడు చిరంజీవిని కలిశాను. ఊళ్ళోవాళ్ళు మనల్ని వెలివేసిన సంగతి చెప్పాను. వాళ్ళ నాన్న మట్టువాడ పోలీసు సబ్ ఇన్స్పెక్టరు. వాడు నన్నాయన దగ్గరకు తీసుకువెళ్ళాడు. ఆయన పేరు ఆనందరావు. నేను చెప్పిందంతా విని ఆయనన్నాడు: 'రెండే ఆల్టర్నేటివ్‌లు ఉన్నయ్యయ్యా ఈ పరిస్థితుల్లో. ఒకటి ఏదో విధంగా వాళ్ళతో రాజీ చేసుకోవటం. రెండు కేసు పెట్టటం. ఐపిసి 339 కింద 'రాంగ్‌ఫుల్ రెస్ట్రెయింట్' అని కేసు పెట్టవచ్చు. ఐపిసి 503 కింద 'క్రిమినల్ ఇన్టిమిడేషన్' అని కేసు పెట్టవచ్చు. ఏ వ్యక్తికి, వ్యక్తులకైనా కీడు చేద్దామనే దురుద్దేశంతో ఆ వ్యక్తిని, వ్యక్తులను గాయపర్చినా, అప్రతిష్ఠపాలు చేసినా, ఆస్తినష్టం కలిగించినా – అంటే లీగల్‌గా ఆ వ్యక్తి, వ్యక్తులు ఏవయితే అనుభవించవచ్చో, అలా అనుభవించనివ్వకుండా అడ్డంకి కలిగించినా, బెది రించినా సదరు వ్యక్తిని, వ్యక్తులను ఈ సెక్షన్ కింద బుక్ చెయ్యవచ్చు. అందువల్ల కక్షలు పెరిగిపోవచ్చు. ఆలోచించు. మీ పెద్దవాళ్ళతో కూడా చర్చించు. మీ ఊరి పెత్తందారు వెంకట్రాయుడు నాకు తెలుసు. రాజకీయపు వత్తిడి తేవచ్చు. ప్రభుత్వ యంత్రాంగం రూల్సు ప్రకారం నడవదు. అది నడిపే మనుషుల బలాన్ని బట్టి నడుస్తూ ఉంటుంది. నువ్వు మా అబ్బాయి స్నేహితుడివి. పదేళ్ళ బట్టీ నిన్ను చూస్తున్నాను. లేకపోతే ఇన్ని మాటలు చెప్పాల్సిన అవసరం నాకు లేదు' అన్నాడు. ఇంత జరిగాక మనకు పోయేదేం లేదు. కేసు పెట్టి వాళ్ళను కోర్టు కీడ్వాలిసిందే" అని

"ఈ పోలీసు వాళ్ళని నమ్మటానికి వీల్లేదురా. డబ్బు వదుల్చుకోవటమే కాని పనవు తుందనుకోను" అన్నాడు బాలచంద్ర.

"మన ఇంటా వంటా లేదు పోలీసు కేసులు పెట్టటం, కోర్టులకెక్కటం. ఆయనన్నట్టు మరింత కక్షలు పెరగటం తప్ప ప్రయోజనమేం ఉండదు" అన్నాడు వెంకటేశ్వర్లు.

"మనం చేతులు ముడుచుకు కూర్చుంటే వాళ్ళు మరింత పెట్రేగిపోతారు, పెద్నా యనా!" అన్నాడు ప్రసాదు.

"వాడు చెప్పిందీ నిజమే. శీతారామయ్య పొలంగనిమె గదిమేవాడు. వాడు ఇంకా గనిమె జరిపినా, మన పొలం అంతా కాజేసినా మనమేం చెయ్యలేం. ఊరోళ్ళెవళ్ళూ మాట్లాడటం లేదు. ఎవరితో చెప్పుకుంటాం. మనకు ఎవరు న్యాయం చేస్తారు. కేసు పెడ్దాం. ఇప్పుడున్న పరిస్థితికంటే మునుచుకు పోయేదేం ఉండదు" అన్నాడు బాలచంద్ర.

"సరే, మీ ఇష్టం" అన్నాడు వెంకటేశ్వర్లు.

బాలచంద్ర, ప్రసాదు మట్టువాడ వెళ్ళి పోలీసు స్టేషనులో కంప్లెయింట్ ఇచ్చారు. సబిన్స్పెక్టరు ఆనందరావు వెంకట్రాయుడికి కబురంపాడు. ఓసారి వచ్చి కలిసివెళ్ళమని. వెంకట్రాయుడు రాంగానే చెప్పాడు. "వెంకటేశ్వర్లు కుటుంబాన్ని మీరు వెలివేశారట. వాళ్ళు

కంప్లెయింటు ఇచ్చారు. కేసులో ముఖ్యులయిన వాళ్ళని అరెస్టు చెయ్యక నాకు తప్పదు. రేపొచ్చి వాళ్ళనందర్నీ అరెస్టు చేస్తాను. మీరు ఇక్కడే మాకు లొంగిపోండి. లాయర్ని కలిసి బెయిలుకు అప్లయి చేసుకోండి. మీరు తెలిసినవాళ్ళు, పెద్ద మనుషులు కనుక ముందుగా ఇన్ఫర్మేషను ఇవ్వటం నా బాధ్యత అనిపించింది. అందుకే కబురంపాను" అని.

వెంకట్రాయుడు వెంటనే వెళ్ళి లాయర్ని కలిశాడు. బెయిలు ప్రయత్నం చేయ మన్నాడు. ఊళ్ళోకి వచ్చి గోపాలాన్నీ, సీతారామయ్యను – మరో పది మంది ముఖ్యపాత్ర ధారులనందర్నీ సమావేశపర్చి పరిస్థితిని వివరించాడు. కోర్టులో బెయిలుకు అప్లయి చెయ్యాలి, లాయరుకు డబ్బివ్వాలి, కోర్టు ఫీజులు కట్టాలి, పోలీసులకు లంచాలు ఇవ్వాలి, కేసు నడిపించాలి కనుక ముందుగా తలా పదిహేనొందలూ పట్టుకు రమ్మని చెప్పాడు. డబ్బు లేదన్న వాళ్ళకి తనే అప్పు పెట్టాడు. పద్దెనిమిది వేలు వసూలు చేశాడు. మర్నాడు గోపాలం, శీతారామయ్యలతో సహా మరో పది మందిని అరెస్టు చేసి మట్టువాడ పోలీస్ స్టేషన్ లాకప్‌లో పెట్టాడు సబిన్స్పెక్టరు. వెంకట్రాయుడు వచ్చి తనే లొంగిపోయాడు. మరో అరగంటలో బెయిలు పత్రంతో లాయరు హాజరయ్యాడు. అందరూ బెయిలు మీద విడుదలయ్యారు.

కోర్టులో కేసు మెల్లగా నడుస్తున్నది. అటు వెంకటేశ్వర్లుకీ, ఇటు వెంకట్రాయుడి పక్షానికీ డబ్బు నీళ్ళలా ఖర్చవుతున్నది. డబ్బు లేక, ఊళ్ళో అప్పిచ్చేవాళ్ళెవరూ లేక నానా అగచాటయి పోయింది వెంకటేశ్వర్లు, బాలచంద్రలకు. బాలచంద్ర వెళ్ళి ఆనందరావుతో మొత్తుకుంటే ఆయన సాయం చేశాడు. మట్టువాడలో ఓ ఆసామీకి వాళ్ళ పొలం ఎకరం లక్ష రూపాయలు ఖరీదు చేసేదాన్ని డెబ్బై ఐదు వేలకు అమ్మించి పెట్టి ఆదుకున్నాడు. కేసు నడిపించటానికి రెండు మూడు నెలలకోసారి కేసులున్న పన్నెండు మంది దగ్గరా వెయ్యో, పదిహేను వందలో వసూలు చేస్తూనే ఉన్నాడు వెంకట్రాయుడు. వెంకట్రాయుడి జేబు బరువుని లాయరూ, పోలీసులూ పంచుకుంటూ అతనికి సాయం చేశారు. ఇరుపార్టీల వారికీ పొలం పన్లు చెడిపోతున్నాయి. ప్రతి వాయిదాకీ కోర్టుకు హాజరుకావాల్సి రావటంతో విసుగేసింది. ఆర్థికంగా తమ నడ్డి విరిగిపోయినట్లయింది. వెంకట్రాయుడు తనకున్న రాజకీయపు పలుకుబడితో కేసు బుక్ కాకుండా ప్రయత్నించాడు. కానీ వీలుపడలేదు. వెంకట్రాయుడి పక్షం వాళ్ళు ఏదోవిధంగా రాజీకి వద్దామని, అందుకు ప్రయత్నించమనీ అతన్ని అర్థించారు. వెంకట్రాయుడికీ విసుగేసింది. అయితే, తనంత తాను రాజీకి ప్రయ త్నిస్తే వెంకటేశ్వర్లు వర్గం కొమ్మెక్కి కూచుంటుంది. అందుకే సబిన్స్పెక్టరు ఆనందరావుకు చెప్పాడు, రాజీ కుదర్చమని. ఆనందరావు రాజీ ప్రస్తావన తెచ్చినప్పుడు ప్రసాదు అందుకు విముఖత చూపాడు. కానీ, వెంకటేశ్వర్లు, బాలచంద్ర ఏదోవిధంగా కేసు నుండి బయట పడ్డామన్నారు. సంఘ బహిష్కరణ కంటే కోర్టు కేసు వాళ్ళని మరింత బాధించింది. చివరకు ఇరువర్గాల వారినీ సమావేశపరచి, మట్టువాడ పోలీసు స్టేషనులో పోలీసు పంచాయితీ జరిపించాడు సబిన్స్పెక్టరు ఆనందరావు.

"సరేనండీ, ఎస్సయ్‌గారూ, మీరు చెప్తున్నారు కనుక మేం వెలి ఎత్తివేస్తాం. అందుకు కొన్ని షరతులు ఉన్నాయి. వాటిని వాళ్ళు అంగీకరిస్తే వాళ్ళని మాలో కలుపుకోటానికి మాకేం అభ్యంతరం లేదు" అన్నాడు వెంకట్రాయుడు.

"ఏమిటో ఆ షర్తులు?" అనడిగాడు బాలచంద్ర.

"ముందుగా మాపై కేసు ఎత్తేసుకోవాలి. రెండు – మాకు డబ్బు ఖర్చయింది, కోర్టుల చుట్టూ తిరగటమైంది. అందుకు లక్ష రూపాయలివ్వాలి. మూడు – కృష్ణవేణిని 'బసివి'ని చెయ్యాలి. నాలుగు – ప్రసాదు ఊళ్ళో ఉండటానికి వీల్లేదు".

కృష్ణవేణిని 'బసివి'ని చెయ్యాలనేటప్పటికి ఆగ్రహంతో ఊగిపోయాడు ప్రసాదు. అయితే, అతను తన ఆగ్రహాన్ని వ్యక్తీకరించే అవకాశం లేకుండానే గోపాలం చిర్రెత్తినట్టు అరిచాడు. "కృష్ణవేణిని 'బసివి'ని చెయ్యాలని మేం అన్నామా? నువ్వేదో దురుద్దేశంతో మాట్లాడుతున్నావు, రాయుడూ! మా ఇంటి పిల్లను గురించి నువ్వేం మాట్లాడినా నేను సహించను" అని

"అదేంది అట్లా అంటావు! లక్ష్మమ్మ చేతబడి చేసి నీ కొడుకుని చంపింది. అందుకు దాని కూతురుకు శిక్షపడాలి. ఆ ముం...కి పొగరు. ఊరి పెద్దను నేనంటేనే దానికి లెక్కలేదు. అందుకే, దాన్ని 'బసివి'ని చెయ్యాలంటున్నాను. ఊరంతటికీ రండవుతుంది అప్పుడు. అదే ఆ కుటుంబానికి మనం విధించే శిక్ష" అన్నాడు రాయుడు.

"చెప్పు తీసుకకొడ్తా, నా కొడకా, మళ్ళీ ఆ మాట అన్నావంటే! ఊళ్ళో ఆడాళ్ళంతా నీకు ము...లు, రండలట్రా? మాకు ఆస్తి తగాదాలుండొచ్చు, కోపాలుండొచ్చు. కానీ, అది నా కూతుర్లాంటిది. దాన్ని గురించి ఇంకొక్క మాట అన్నా నేను ఊర్కోను. ఇప్పుడు నాకు అర్థమవుతోంది నీ కపటం. దానిమీద నీ కన్ను పడింది. అది నిన్ను కాదనేసరికి, చేతబడి అని ప్రచారం చేశావు. కోర్టు కేసులని మా డబ్బు తిన్నావు. నువ్వేం ఊరి పెద్దవురా, నా కొడకా! ఊరి భక్షకుడివి!" అంటూ కోపంతో ఊగిపోయాడు గోపాలం.

"ఇదుగో నోరు సంబాలించుకు మాట్లాడు. ఇది పోలీసు స్టేషనయింది కనక బతికి పోయావు. లేకపోతే..."

"లేకపోతే ఏం జేస్తావు! ఏంజేస్తావో చెయ్యి చూద్దాం" అని చెప్పు తీసుకు లేచాడు గోపాలం.

సబిన్స్పెక్టరు ఆనందరావుకు అతన్ని శాంతపరిచేటప్పటికి చచ్చిన చావైంది.

"ఇదుగో రాయుడూ, నువ్వు మళ్ళా పాత పంథాలోనే పోతున్నావు. ఏ ఆడకూతుర్నీ 'బసివి'ని చెయ్యటానికి చట్టం ఒప్పుకోదు. ఆ షర్తు పెట్టినందుకే నిన్ను అరెస్టు చేయ్యవల్సి వుంది. నువ్వు పెట్టిన నాలుగో షరతు కూడా చెల్లదు. ఎవరు ఊళ్ళో ఉండాలి. ఎవరు ఊళ్ళో ఉండకూడదు అని నిర్ణయించే అధికారం నీకు లేదు. కనుక, మొదటి రెండు షరతుల గురించి మాట్లాడండి" అన్నాడు ఆనందరావు.

"అయితే, మాకు రాజీ అవసరంలేదు" అంటూ లేచాడు వెంకట్రాయుడు.

"మీరు కూర్చోండి. రాజీ అవసరం లేదంటే కోర్టు కేసు నడుస్తుంటది. అంటే మేం డబ్బు ఖర్చు పెట్టాలి. మా వల్ల కాదు. మీరు రాజీపడకపోయినా, మేం రాజీపడ్తాం, మేం ఖర్చుపెట్టిన డబ్బు మాకొస్తే" అన్నాడు శీతారామయ్య.

వెంకట్రాయుడికి దిక్కుతోచలేదు. మిగిలిన పరువేదయినా కాపాడుకోవాలంటే తనూ రాజీకి రావాల్సిందే. అందుకే ఏం మాట్లాడకుండా కూర్చున్నాడు. మొదటి రెండు షరతుల గురించి చర్చ జరిగింది.

"కోర్టు కేసు ఉపసంహరించుకోటానికి మాకేం అభ్యంతరం లేదు. లక్ష రూపాయలు కట్టాలంటే మాత్రం మావల్ల కాదు. మీరే కాదు డబ్బు ఖర్చు పెట్టింది. మేమూ ఖర్చు పెట్టాం..." అన్నాడు బాలచంద్ర.

"అర్థమైందిగా, ఎస్సైగారూ, 'చేతబడి' అన్నది ప్రచారమని తేలిపోయింది. దురుద్దేశంతో, కరుడుగట్టిన స్వార్థంతో ఓ కుటుంబాన్ని శిక్షించటానికి వేసిన పథకమని అర్థమయిపోయింది. సరే, మీరు పెట్టిన ఖర్చులకింద మేం లక్షరూపాయలు ఇస్తాం. మీరు మామీద దుష్ప్రచారం చేశారు. వెలివేసి హింసించారు. మా మొహాల మీద ఉమ్మేసి అవమానించారు. అందుకు మీకేం శిక్షలేదా? అందుకు తప్పు కింద మీరు మాకు రెండు లక్షలు చెల్లించండి" అన్నాడు ప్రసాదు.

"ఊఁ మాట్లాడు, గోపాలం! ఆ నా కొడుకు మనకు జుర్మానా వేస్తడంట. కట్టు, రెండు లక్షలు ఎక్కడ నుంచి తెచ్చికడ్తావో! చేతబడి చెయ్యలేదన్నది తేలిపోయిందంట. మరి ఊళ్ళో పిల్లగాళ్ళు ఎందుకు చచ్చిపొయ్యారు?" అన్నాడు వెంకట్రాయుడు.

"మందు లేక చచ్చిపోయారు, వైద్యం లేక చచ్చిపోయారు. ఊరి జనానికి అక్షరాస్యత అంటక చచ్చిపోయారు. ఊరి జనానికి విజ్ఞాన వికాసాలు కలిగించనివ్వని నీ పెత్తందారీ తనంవల్ల చచ్చిపోయారు."

"ఈ నగ్జలైటు నా కొడుకుని ఇలా మాట్లాడనిస్తూనే ఉంటారా, మీరు, ఎస్సైగారూ? మీ ఎదుటే వీడింతగా నన్ను అవమానిస్తుంటే మీరు పట్టించుకోవటం లేదు" అని ఫిర్యాదు చేశాడు వెంకట్రాయుడు ఎస్సైకి.

అలా అనంగానే ప్రసాదు లేచి, "థూ" అని వెంకట్రాయుడి ముఖం మీద ఊశాడు.

"ఏయ్, ప్రసాదూ. ఏంటి నువ్వు చేసిన పని? పోలీసు స్టేషనులోనే..." అని సబిన్స్పెక్టరు అంటుండగానే,

"ఆయనకు అవమానమంటే ఎలా ఉంటుందో రుచి చూపించాటనికే అలా చేశాను కానీ మరొకందుకు కాదు. 'వీడు' 'వాడు' 'నగ్జలైటు' అని నన్నసే అధికారం ఆయన కెవరిచ్చారండీ? ఆయన హద్దుల్లో ఆయనుంటే నా హద్దుల్లో నేనుంటాను. అయినా, ఎవరు చేసినా తప్పు తప్పే. పెద్దలు మీరు. పెద్ద హృదయం చేసుకుని నన్ను క్షమించెయ్యండి,

రాయుడుగారూ!" అన్నాడు ప్రసాదు, లేచి తన జేబు రుమాలుతో అతని ముఖం మీద ఉమ్మి తుడుస్తూ.

"ఛ... ఛ... పరువుపోయాక నేనిక్కడుండను" అని లేచాడు ఆగ్రహంతో వెంకట్రాయుడు.

"క్షమించమన్నాడు కదండీ. అయినా మీరు చేసిన తప్పుకంటే ఆ పిల్లవాడు పెద్ద తప్పేంచేయలేదు" అని బతిమిలాడి అతన్ని కూర్చోపెట్టాడు సబిన్స్పెక్టరు.

"ఇందులో మేం చేసిన తప్పేంలేదండీ, వాళ్ళు చేతబడి చేసింది ఖాయం. వాళ్ళు లక్ష రూపాయలు ఖర్చులనుగాను చెల్లించేటట్లుంటే మాలో కలుపుకుంటాం. లేకపోతే లేదు" అన్నాడు వెంకట్రాయుడి మద్దతుదారు వీరన్న.

లక్ష రూపాయల చెల్లింపు విషయంలో రెండు బృందాల మధ్యా వాగ్వాదం ఓ అరగంట నడిచింది. ఈ లోపల రెండు బృందాలూ రాజీ వద్దని వాకవుట్ చేయ ప్రయత్నించాయి. సబిన్స్పెక్టరు ఆనందరావు చివరకు విడివిడిగా రెండు బృందాలతోనూ మాట్లాడాడు. "లక్ష రూపాయలు కాదుగానీ, ఓ యాభైవేలుకు నేను వాళ్ళని ఒప్పిస్తాను. కేసులో మీరు గెలవవచ్చు. దానికి మరింకో రెండేళ్ళు పట్టవచ్చు. ఇప్పటికే ఓ ఎకరం అమ్మారు. మరో ఎకరం అమ్మాల్సి రావచ్చు. ఈ లోపల వెలి వల్ల మీరు పడే బాధలు ఎన్నో ఉన్నాయి. కనుక నా మాట విని మీరు యాభై వేలకు ఒప్పుకోండి" అని నచ్చచెప్పాడు ఎస్సై వెంకటేశ్వర్లు బృందానికి. వెంకటేశ్వర్లు అంగీకరించాడు కానీ, బాలచంద్ర, ప్రసాదు తేలిగ్గా ఒప్పుకోలేదు. "అమ్మాయికి పెళ్ళి కావాలి. కోర్టు కేసు ఎప్పుడు తేలుతుందో ఎవరూ చెప్పలేరు. అంతకాలం పిల్లకు పెళ్ళి చేయకుండా ఉంటారా? ఈ కేసు నడుస్తున్నంతకాలం వెలిలో ఉన్న మీ పిల్లను పెళ్ళి చేసుకోవటానికి ఎవరు ముందుకు వస్తారు" అని ఆఖరి బాణం వదిలాడు ఎస్సై. దాంతో బాలచంద్ర, ప్రసాదులకు ఒప్పుకోకతప్పలేదు.

"మీరు అనవసరపు పట్టుకుపోకండి. రెండేళ్ళలాగోవాళ్ళు వెలిగానే బతికారు. మరో రెండేళ్ళు బతుకుతారు. అలవాటయింది కనుక వాళ్ళకు కష్టంలేదు. కేసు తీర్పయితే మీకు శిక్ష పడటం ఖాయం కనుక నేను చెప్పేదేమిటంటే వాళ్ళు యాభైవేలు ఇచ్చేట్టు నేను వాళ్ళని ఒప్పిస్తాను. మీరు అంగీకరించండి. లేదూ అంటే యాభైవేలు రాకపోగా, ఇంకా మీరు డబ్బు ఖర్చు పెట్టాలి, కోర్టు చుట్టూ తిరగాలి. చివరకు కనీసం రెండేళ్ళయినా జైలు కూడుతినాలి" అని చెప్పాడు ఎస్సై వెంకట్రాయుడి వర్గానికి.

వెంకట్రాయుడికీ ఎస్సై చెప్పిన మాటలకు అంగీకరించక తప్పలేదు. కేసు విషయంలో తమ లాయరు భరోసాగా చెప్పలేదు. పైగా తన వర్గంలో వాళ్ళెవరూ ఇంకపైన ఖర్చు పెట్టటానికి సుముఖంగా లేరు. అందులో కొంతమంది – గోపాలం లాంటి వాళ్ళు ప్రత్యర్థి వర్గంవైపు తిరిగి పోయేట్టున్నారు. అందుకే "సరే" అన్నాడు వెంకట్రాయుడు.

"ఇంకోమాట. వాళ్ళిచ్చే యాభైలో మీకు ముట్టేది నలభయ్యే. మిగతా పది మా ఖర్చులకు" అన్నాడు ఎస్సై ఆనందరావు.

పోలీసులను తృప్తి పర్చకపోతే అనవసరపు చిక్కుల్లో పడాల్సి వస్తుందని తెల్సు వెంకట్రాయుడి వర్గానికి. మరేం మాట్లాడకుండా అందుకంగీకరించారు వాళ్లు.

అలా ఎస్సై ఆనందరావు విజయవంతంగా నడిపించాడు పోలీసు పంచాయితీ. రాజీ పత్రం తయారయింది. వెంకటేశ్వర్లు బృందం కేసు ఖర్చుల కింద యాభైవేలు చెల్లించ టానికీ, యాభై వేలు స్వీకరించి వెలినెత్తివేసి వాళ్ళను గ్రామంలో కలుపుకోటానికీ అంగీక రిస్తూ ఇరువర్గాలూ సంతకం చేశాయి. సాక్షి సంతకాల కోసం ఊళ్ళో పెద్దమనుషుల్ని ఇద్దర్ని పిలిచారు. రెండు రోజుల్లో తనే డబ్బు వసూలుచేసి ఇస్తానని చెప్పాడు ఎస్సై వెంకట్రాయుడికి. రాజీ పత్రం మాత్రం తన దగ్గరనే ఉంటుంది, మళ్ళీ తేడాలు రాకుండా. వెంకటేశ్వర్లు వర్గం కేసు నెత్తివేసుకుంటున్నట్లు, అందుకు కోర్టువారి అనుమతి కోరుతూ అభ్యర్థన పత్రం రాసి ఎస్సైకి ఇచ్చారు.

అలా రాజీ జరిగి, ఇరువర్గాలూ వెళ్ళిపోయాక, ఇదంతా చూస్తున్న ఓ పత్రికా విలేఖరి అడిగాడు ఎస్సై ఆనందరావును "భలే పంచాయితీనండీ మీది! వెంకటేశ్వర్లు వర్గం వాళ్ళు రెండేళ్ళుగా సంఘబహిష్కరణకు గురై నానా ఇబ్బందులూ పడ్డారు. చేతబడి చేస్తున్నారన్న అపవాదుకు గురై అంతులేని మానసిక వేదన అనుభవించారు. అవమానాల పాలయ్యారు. 'అయ్యా మాకు న్యాయం చేయండి' అని మిమ్మల్ని అర్థించితే వాళ్ళకే యాభైవేల రూపా యలు జరిమానా- ఖర్చుల పేరుతో - విధించి, నిందితులకు బహుమానంగా ఇప్పించారు. సెభాష్! మీ పోలీసు పంచాయితీతో ఓ చరిత్ర సృష్టించారు" అని.

ఆనందరావు నవ్వాడు, "ఆఫ్ ది రికార్డంటే ఓ మాట చెప్తాను. లేకపోతే నోరు మెదపను" అన్నాడు.

"చెప్పండి అన్నాడు విలేఖరి

"చేతబడులు, బాణామతులు అంటూ గ్రామ ప్రాంతాల్లో ఎప్పటి నుండో వ్యాప్తిలో ఉన్న మూఢనమ్మకాలు ఇప్పటికీ సజీవంగానే ఉన్నాయి. బాణామతిని అదుపుచేయటానికి నిజాం ప్రభుత్వంలో 'బాణామతి ఇన్స్పెక్టర్లు' ఉండేవాళ్ళు. ప్రభుత్వం జనంలో చైతన్యం కలిగించాలి. మూఢనమ్మకాలను పారదోలాలి. అందుకు అక్షరాస్యత పెంచాలి. ఆ పనులేవీ ఏ ప్రభుత్వం చేపట్టటం లేదు. వాళ్ళకు రాజకీయ కుమ్ములాటల్లోనే సరిపోతున్నది. మేము పోలీసులం మా చేతనైన పద్ధతిలో శాంతి భద్రతలు నెలకొల్పటానికి ప్రయత్నిస్తున్నాం. కొంతమంది నష్టపోవచ్చు. కానీ, ఆ తర్వాత వాళ్ళు ప్రశాంతంగా బతికే అవకాశం ఉంటుంది. అందుకే పోలీసు పంచాయితీ నిర్వహించాం. ఇరువర్గాలూ ఓ పద్ధతిన రాజీకి వచ్చేట్టు చేశాం."

"మరి ఆన్ ది రికార్డ్ మాటేమిటి?"

"మేం ఎలాంటి పోలీసు పంచాయితీ నిర్వహించలేదు. ఇరువర్గాలు చేసుకున్న రాజీతో మాకు సంబంధం లేదు. అది వాళ్ళు బయట కుదుర్చుకున్నది మాత్రమే. అందుకు మా పోలీసుల్లో ఎవరూ సాక్షులు కాదు. వివాదంతో కొట్టుకు చస్తున్న రెండు వర్గాలు రాజీకి వస్తే మాకభ్యంతరంలేదు. మాకు కావల్సింది శాంతి భద్రతలు."

"మరి న్యాయం జరగదన్నమాట అన్యాయానికి గురయిన వర్గానికి!"

"మళ్ళీ ఆఫ్ ద రివార్డ్. అసలు న్యాయం ఎక్కడుంది? బలవంతుడి దగ్గరుంది. వెంక ట్రాయుడి వర్గానికి బలం ఉంది. జైలు శిక్షలపాలయినా వాళ్ళు మరింత కక్ష పెంచు కుంటారు కానీ వెంకటేశ్వర్లు వర్గాన్ని హాయిగా బతనివ్వరు. రాజ్యాంగ చట్టపరంగా సంక్రమించిన అధికారాలతో పోలీసులకు బలం ఉంది. అందువల్ల మాకు లాభసాటయిన వర్గాన్ని ఎంచుకుని, రెండో వర్గానికి కూడా మరింత దురన్యాయం చేయకుండా, మాకు తోచిన తీర్పిచ్చాం. అందుకు ఇరువర్గాలూ అంగీకరించేట్టు చేశాం. తీర్పుని అమలు పర్చే శక్తి కూడా మాకు ఉంది. కనుక 'పోలీసు పంచాయితీ' అని మీరు పత్రికల్లో రాసినా మాకొచ్చేనష్టంలేదు. మీకువచ్చే లాభంలేదు. ఎందుకంటే, ఏదీ మీరు ప్రూవు చేయలేరు కనుక" అన్నాడు పోలీసు ఇన్స్పెక్టరు ఆనందరావు.

'ఆంధ్రప్రభ' సచిత్ర వారపత్రిక, 22 ఫిబ్రవరి 2003, 1 మార్చి 2003